
సాక్షి
జగిత్యాల

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



మరమ్మతులు ఎప్పుడో?

జిల్లావ్యాప్తంగా గత వర్షాకాలంలో వానలకు కొట్టుకుపోయిన రోడ్లకు ఇంకా మరమ్మతులు పూర్తికావడం లేదు. 8లో▸



భక్తుల కోలాహలం

వేములవాడ: రాజన్నను గురువారం భారీగానే భక్తులు దర్శించుకున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

సెల్లార్‌లో వ్యాపారాలు

- పట్టింపులేని మున్సిపల్ అధికారులు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- జిల్లాలోని మూడు పట్టణాల్లో తప్పని ట్రాఫిక్ తిప్పలు

జగిత్యాల: పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన సెల్లార్లు అక్రమార్జనకు ఆవాసంగా మారాయి. జిల్లాలోని జగిత్యాలతో పాటు మెట్‌పల్లి, కోరుట్లలో ఇదే పరిస్థితి నెలకొంది. కొందరు భారీషాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు అద్దెకివ్వడం ఇబ్బందికరంగా మారుతోంది. సదరు దుకాణాలకు వచ్చేవారంతా రోడ్లపైనే వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఒకవైపు ఇరుకు రోడ్లు, వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో పాటు ప్రజలు నడిచేందుకూ అవకాశం లేకుండా పోతోంది. మున్సిపల్ అధికారులు పార్కింగ్ సౌకర్యం ఉందా లేదా అని చూడకుండా వ్యవహరిస్తున్నారు. కొందరు యజమానులు పార్కింగ్‌తో తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాకేంద్రంలో ప్రధానమైన వ్యాపార ప్రాంతం టవర్‌సర్కిల్. ఇక్కడ పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్, వాణిజ్య సముదాయాలు వెలిశాయి. నూతనంగా నిర్మించిన వాటికీ సెల్లార్లు లేవు. సెల్లార్లు ఉన్నవారు చిరువ్యాపారులకు అద్దెకిస్తున్నారు. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు, నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారు. సెల్లార్లలో వ్యాపారాలు చేయడంతో పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలు తంటాలు పడుతున్నారు.

జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, తహసీల్ చౌరస్తా, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు సైతం పెద్ద పెద్ద భవనాల్లో నిర్మించగా ఇందులో సెల్లార్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని కూడా అద్దెకిస్తున్నారు. నిబంధనల ప్రకారం సెల్లార్లను అద్దెకివ్వకూడదు. పార్కింగ్ కోసమే వినియోగించుకోవాలి. కానీ వీటిని సైతం అద్దెకివ్వడంతో రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి.



కొత్తబస్టాండ్ వద్ద సెల్లార్‌లో నిర్వహిస్తున్న షాపులు



నిజామాబాద్ రోడ్డులో నిర్వహిస్తున్న షాపులు

ఫిర్యాదుల వెల్లువ

జగిత్యాలలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అనేకమంది సెల్లార్లపైన ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఒకరిపై కూడా చర్యలు తీసుకోలేదు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే తప్పా అధికారులు చలించే పరిస్థితి లేదు. సెల్లార్లలోనే దాదాపు భవనానికి సంబంధించిన కరెంట్ మీటర్లు, లిఫ్ట్‌కు సంబంధించిన కరెంట్ బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. షార్ట్‌సర్క్యూట్ అయితే కనీసం అగ్నిమాపకశాఖ వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వ్యాపారులతో పాటు ప్రజలకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెల్లార్లను పార్కింగ్ కోసమే వినియోగించేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే అంతే

ఇటీవల హైదరాబాద్‌తో పాటు పెద్దపెద్ద పట్టణాల్లో సెల్లార్ కలిగిన భవనాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుని ఆస్తితో పాటు ప్రాణనష్టం జరిగిన సంఘటనలున్నాయి. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం నిర్మించే భవనాలల్లో ఖచ్చితంగా సెల్లార్లు ఉండాలి. వాటిని పార్కింగ్‌కే ఉపయోగించాలి. జిల్లాలోని మూడు పట్టణాల్లో చాలా భవనాల్లో సెల్లార్లలో వ్యాపారాలు చేయడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది.

పట్టించుకోని అధికారులు

జిల్లాకేంద్రంలో ప్రధానంగా కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ తదితర ఏరియాల్లో వ్యాపారాలు అత్యధికంగా జరుగుతుంటాయి. ఇటీవల పెద్దపెద్ద భవనాలు వెలుస్తున్నాయి. సెల్లార్ల కోసం అనుమతులు తీసుకుని అందులో జిరాక్స్‌సెంటర్లు, బట్టలషాపులు, మొబైల్‌స్టోర్స్, ఏటీఎం సెంటర్లు, తదితర వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

నోటీసులు ఇచ్చాం

సెల్లార్లలో షాపులు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఈ విషయమై ప్రతి ఒక్కరికీ నోటీసులు జారీ చేశాం. ఖాళీ చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ కోసం వదిలేసిన సెల్లార్లను దాని కోసమే వాడాలి.ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని మా దృష్టికి వచ్చింది. – బోగ నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

న్యూస్‌రీల్

గంగను దివి నుంచి భువికి రప్పించిన మహర్షి భగీరథ



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్లు, సిబ్బంది

జగిత్యాల: గంగమ్మను దివి నుంచి భువికి రప్పించిన గొప్పవ్యక్తి భగీరథ మహర్షి అని అదనపు కలెక్టర్లు లత, మకరంద్ అన్నారు. గురువారం సమీకృత భవనంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. కఠోరమైన దీక్షతో గంగను దివి నుంచి భువికి రప్పించిన భగీరథ మహర్షి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి సాయిబాబా, కలెక్టరేట్ ఏవో నాగార్జున, బీసీ సంఘాల నాయకులు హరి అశోక్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతులు మెరుగుపరచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వసతులు మెరుగుపరచాలని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కథలాపూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. వచ్చే నెలలో కేంద్ర బృందం అధికారులు పర్యటించే అవకాశం ఉందని, పీహెచ్‌సీలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో నిబంధలన మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్ పాల్గొన్నారు.

బాలల హక్కులు, విధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో గురువారం చైల్డ్‌లైన్ 1098 సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 0నుంచి 18ఏళ్ల పిల్లలు తమను తామే ఎలా రక్షించుకోవాలి, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు బాల కార్మికులు, అనాథపిల్లలు, భిక్షాటన చేసేవాళ్లు ఎక్కడైనా కనిపిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ శ్రీనివాస్, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రావణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, చైల్డ్‌లైన్ సభ్యులు రజిత, మానస పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్‌లో 2023–24 సంవత్సరానికి గాను మొదటి బ్యాచ్ 5 నెలల ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వికలాంగులు, స్త్రీ పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ప్రవేశపరీక్ష వచ్చేనెల 21న ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో చూడాలని, మిగతా వివరాలకు 99592 64770లో సంప్రదించాలని కోరారు.

మామిడికాయలు రోడ్డుపాలు



రోడ్డుపక్కన పారబోసిన మామిడికాయలు

మల్యాల: వడగండ్ల వర్షాలకు మామిడి కాయలు రాలిపోవడంతోపాటు, దెబ్బతినడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రోడ్డుపై పారబోశారు. వడగండ్ల దెబ్బతిన్న కాయలు ఎవరూ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా లేకపోవడంతో తోటల్లోని మామిడికాయలు తీసుకువచ్చి, మల్యాల మార్కెట్‌యార్డు సమీపంలో రోడ్డు పక్కన పారబోయడం మామిడి రైతుల దుస్థితికి అద్దం పడుతోంది.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి నవరాత్రోత్సవాలలో భాగంగా రెండోరోజు గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయం స్వామివార్లకు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, సామవేదపారాయణంతో అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే కలశస్థాపన పూజలు, స్థాపిత దేవతాపూజలు, తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రోత్సవాలు ప్రారంభం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం స్వామివార్లను దర్శించుకోవడానికి ఆలయం ఎదుట భక్తులు బారులుతీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించి, ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు.

పోస్టాఫీసులో ఉచితంగా పెన్షన్ తీసుకునే అవకాశం



వెంకటేశ్వర్లు

జగిత్యాల: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా ఆసరా పెన్షన్ డబ్బులు తీసుకునే అవకాశం సంస్థ కల్పించిందని కరీంనగర్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగుల, చేనేత, గీత కార్మికులు ఆసరా పింఛన్ల చెల్లింపులు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు తీసుకుని వెళ్తే పెన్షన్ డబ్బులు ఇవ్వడం జరుగుతుందని వివరించారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



జగిత్యాల జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మూడేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయిందని, వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జగిత్యాల రూరల్‌మండల పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్లు మకరంద్, బీఎస్.లతకు వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు విధి నిర్వహణలో మృతిచెందిన పంచాయతీ కార్యదర్శుల ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి కావడంతో తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులుగా నియమితులైన వారిని జేపీఎల్‌గా మార్చి వారివారి పని కాలానికి కూడా సర్వీస్‌గా పరిగణించాలన్నారు. జిల్లాలో 306 మంది జూనియర్ అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారని, వీరిని వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, జనరల్ సెక్రటరీ సంతోష్, నదీమ్, మల్లికార్జున్, షరీఫ్, మహిళా అధ్యక్షురాలు రవళి, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీజీవో జిల్లా నాయకులకు వినతిపత్రం సమర్పించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర యూనియన్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు నవీన్, ఎంపీవోల సంఘం అధ్యక్షుడు కందుకూరి రవిబాబు ఉన్నారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తోంది



జీవన్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



అడ్లూరిని అడ్డుకుంటున్న పోలీసులు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/బుగ్గారం: రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. వెల్గటూరు మండలం పాశిగామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన చేపట్టగా మద్దతు తెలిపేందుకు వెళ్తున్న జీవన్‌రెడ్డిని పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షాలను ప్రభుత్వం నిరసన తెలపకుండా అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రజల ప్రాణాలకు హాని ఉందని, ఫ్యాక్టరీ వద్దని గ్రామస్తులు ధర్నాలు చేపడితే వారికి మద్దతు తెలపడం తప్పా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ధర్మపురిలో హౌస్ అరెస్టయిన డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. వెల్గటూర్ మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు 28రోజులుగా తిండీతిప్పలు మానివేసి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని, అధికార పార్టీ నాయకులు, సర్పంచులూ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా తీర్మాణాలు చేస్తున్నప్పటికీ పనులు కొనసాగించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును ఆపివేస్తామని హామీ ఇచ్చారు.

అభ్యంతరాల స్వీకరణ

జగిత్యాల: డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్‌లో ఒప్పంద ఉద్యోగ నియమక అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. ఉద్యోగాల నియమకం కోసం మార్చిలో 20 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, సర్టిఫికెట్లకు సంబంధించిన వెరిఫికేషన్ మార్చి 28న పూర్తయిందన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అభ్యంతరాలున్నచో ఈనెల 28 నుంచి వచ్చే నెల 2 వరకు స్వీకరిస్తామని వివరించారు.

జీపీఎఫ్ బకాయిలు

28
రూ. కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ గోస

- తొమ్మిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్, పార్టు ఫైనల్ లోన్స్, అడ్వాన్సులు



‘భార్యభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులే. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మల్యాల మండలంలో భర్త పనిచేస్తుండగా.. ఆయన భార్య ధర్మారం మండలంలో పనిచేస్తున్నారు. వారి గ్రామంలో భూమి కొనుగోలు కోసం సెప్టెంబర్‌లో క్రయవిక్రయ ఒప్పందం జరిగింది. ఇరువురు జిల్లా పరిషత్‌లో వారి జీపీఎఫ్ ఖాతాల్లో సొంత డబ్బును రూ.15 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలుగా వారికి రావాల్సిన లోన్ రావడం లేదు. దీంతో జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.’

‘చొప్పదండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. ఆయనకు రావాల్సిన బకాయిల కోసం అక్టోబర్‌లో దరఖాస్తులు సమర్పించారు. నేటికీ పెన్షన్, ఇతరత్రా డబ్బుల కోసం జడ్పీ జీపీఎఫ్ విభాగంలో వాకబు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు డబ్బులు అందలేదు’.

‘గంగాధర మండల కేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆరోగ్య రీత్యా అవసరం ఏర్పడి కొంత మేరకు లోన్ కావాలని దరఖాస్తు సమర్పించారు. ఐదు నెలలు గడుస్తున్నా లోన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు’.

ఇది ఇలా ఒకరిద్దరి ఉపాధ్యాయుల బాధ కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొమ్మిది నెలలుగా వివిధ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వెతలు..

ఇలా తొమ్మిది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఎందరో జీపీఎఫ్ డబ్బుల కోసం కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.’


కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, వరంగల్ అర్బన్, భూపాలపల్లి జిల్లాలోని 71 మండలాల్లో 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు విద్యాశాఖలో పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) విభాగం నుంచి పదవీ విరమణ పొందిన సమయంలో వీరి పెన్షన్ డబ్బులతో పాటు ఇతరత్రా సదుపాయాలు పొందే వీలుంటుంది. పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి సర్వీసును బట్టి తాము దాచుకున్న డబ్బులు అవసరాల కోసం తీసుకోవచ్చు. ఇల్లు రిపేరు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆరోగ్య రీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ విభాగం నుంచి డబ్బులు పొందే వీలుంది. కానీ.. జిల్లా పరిషత్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాము అవసరాల కోసం దాచుకున్న డబ్బుల కోసం వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్‌లోని జీపీఎఫ్ విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గతంలో పలుమార్లు ధర్నాలు నిర్వహించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. తాజాగా ఈ విద్యా సంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ఏటా ఇదే తంతు జరుగుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

పార్ట్ ఫైనల్ రూ.18,99,40,000
ఫైనల్ పేమెంట్స్ (స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతి చెందినవారివి) రూ.7,40,11,000
అడ్వాన్సులు రూ.1,60,49,000
రావాల్సిన బకాయిలు మొత్తం రూ. 28 కోట్లు

బకాయిలు ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.28 కోట్ల పైబడి ఉంటాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీపీఎఫ్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జీపీఎఫ్ విభాగం సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి వివిధ రకాల బిల్లులు 243 మంది ఉపాధ్యాయుల పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి దాదాపు 28 కోట్ల రూపాయల చెక్కులు రాసినట్లు చెప్పారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు పంపామని.. ఈ–కుబేర్ వల్ల జాప్యం అవుతోందని.. అది ప్రభుత్వ పరిధిలోని అంశమని సమాధానమిచ్చారు.

పెండింగ్ బిల్లులన్నీ సకాలంలో చెల్లించాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతిచెందిన వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా మానసికక్షోభకు గురిచేయడం తగదు. ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ విభాగం నుంచి అత్యవసర నిమిత్తం డబ్బులు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కాలరాయడం భావ్యం కాదు. తొమ్మిది నెలలుగా 400 మందికిపైగా ఉపాధ్యాయులకు మంజూరై ఉన్న రూ.28 కోట్ల డబ్బులు వెంటనే చెల్లించాలి.

– తూముల తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

కోరుట్ల : పట్టణంలోని రాంనగర్ ప్రాంతానికి చెందిన కొత్తపల్లి అశోక్ (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. అశోక్‌కు భార్య నాగరాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. అశోక్ కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యను వేధిస్తున్నాడు. దీంతో నాగరాణి వారం క్రితం తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. గురువారం స్థానికులు అశోక్ ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అశోక్ మృతిచెంది ఉన్నాడు. మూడు, నాలుగు రోజుల క్రితమే మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్‌లో మెట్‌పల్లి యువకుడి మృతి

మెట్‌పల్లి : పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన విజయ్ (35) అనే యువకుడు దుబాయ్‌లో మృతిచెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కోసం ఏడాదిన్నర క్రితం విజయ్ దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ కూలీ పనిచేస్తూ మృతి చెందినట్లు గురువారం కుటుంబ సభ్యులకు సమాచారమందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అతని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మహిళ మెడలోంచి పుస్తెల తాడు చోరీ

బుగ్గారం (ధర్మపురి) : ఇంటిముందు వరండాలో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలోంచి పుస్తెల తాడు చోరీ అయిన ఘటన ధర్మపురి మండలం.. నర్సయ్యపల్లె గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోరుబొంతల జమున తనఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. జమున ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రి భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం: ప్రమాదవశాత్తు ఓ ఆసుపత్రి భవనం పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం రాగినేడుకు చెందిన బొజ్జ సమ్మయ్య(64)కంటి చూపు సమస్యతో ఈనెల 24న ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు ఓ కంటికి ఆపరేషన్ చేసి మరో కంటికి పరీక్ష చేయాల్నారు. 26న రాత్రి 11 గంటలకు ఆసుపత్రి భవనంపైకి ఎక్కి కిందపడ్డాడు. ఉదయం సమ్మయ్య భార్య భూదేవి లేచిచూడగా కింద గాయపడి కనిపించాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జూలపల్లి(పెద్దపల్లి): మహిళా ప్రజాప్రతినిధులను చులకన భావంతో చూస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జూలపల్లి ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని మహిళా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షురాలు, జూలపల్లి ఎంపీటీసీ అమరగాని మమత కలెక్టర్, జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు మమత పేర్కొన్నారు.

మరమ్మతుకు నోచుకునేదెప్పుడో?

- గతేడాది వరదలకు ధ్వంసమైన రోడ్లు
- నేటికీ పూర్తికాని మరమ్మతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పొంచి ఉన్న ప్రమాదాలు..



వరద ఉధృతికి కోతకు గురైన రాష్ట్ర రహదారి (ఫైల్)

బుగ్గారం : గతేడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు మండలాల్లో చాలాచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. గత సంవత్సరం జూలైలో వారంరోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం బాగా దెబ్బతిన్నాయి. ఏడాది గడిచినా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రూ. 59.47 కోట్లు అంచనా..

వరదల తాకిడికి జిల్లాలోని పలు మండలాల్లో కోతకు గురైన, ధ్వంసమైన రహదారుల నష్టం అంచనా రూ.59 కోట్ల 47 లక్షలు అని రోడ్లు, భవనాల శాఖ జగిత్యాల జిల్లా అధికారి ఎం.శ్రీనివాస్ గతంలో తెలిపారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని మొత్తం రోడ్ల విస్తీర్ణం 1189.88 కి.మీ కాగా పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున కోతకు గురయ్యాయి. ముఖ్యంగా వాగులు, కాలువలు, చెరువుల సమీపంలోని రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నాయి. మొత్తం 144 కి.మీ మేర రహదారులు ఉపరితలంలో దెబ్బతిన్నట్లు గతంలోనే ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. వీటి మరమ్మతులకు సంబంధించి గతేడాదే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలిపారు. కాగా దెబ్బతిన్న రహదారులకు చేసిన మరమ్మతుల వివరాల గురించి ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించగా కనీస స్పందన కరువైంది.

రక్షణ చర్యలు కరువు..

కోతకు గురై ఇరుకుగా మారిన రోడ్ల వద్ద కనీస రక్షణ చర్యలు కరువయ్యాయి. ముఖ్యంగా పలు మండలాలను కలిపే ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర రహదారిపై సైతం ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ధర్మపురి నుంచి మంచిర్యాల జిల్లాకు, వయా కలమడుగు మీదుగా వెళ్లే రాష్ట్ర రహదారి ధర్మపురి మండలంలోని కొరండ్లపల్లె సమీపంలో భారీగా కోతకు గురైంది. సమీపంలోని చెరువు నుంచి వచ్చే కాలువ వల్ల ఈ రోడ్డు భారీగా కోతకు గురైంది. ఈ ప్రాంతంలో కొన్నిరోజులు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసినప్పటికీ తర్వాత తొలగించారు. బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి వెళ్లే రహదారి సైతం గ్రామశివారులోని కాలువ ప్రవాహం వల్ల భారీ కోతకు గురైంది. వాహనదారులు రోడ్డుపై ఏమాత్రం అదుపుతప్పినా సమీపంలోని కాలువల్లో పడి ప్రమాదాలకు గురవడం ఖాయం. మల్యాల మండల కేంద్రానికి చెందిన ఓ రైతు గతేడాది ఆగస్టులో తన వ్యవసాయ పనులు ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేబోయి రోడ్డుపై భారీగా గుంతలు ఉండడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలుకాగా ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. ఇలాంటి ఘటనలు, ఇతర ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి.

రహదారులను బాగుచేయాలి

కోతకు గురైన రోడ్ల మరమ్మతులు ఆలస్యమయ్యేకొద్దీ మరింత ధ్వంసమయ్యే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలం దగ్గర పడుతుండటంతో మరోసారి వరదలు సంభవిస్తే నష్టం మరింత పెరిగిపోతుంది. దీంతో రాకపోకలకు నిలిచిపోయే అవకాశం ఉంది. ధ్వంసమైన ప్రధాన రహదారులను తక్షణమే బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో ధ్వంసమైన రహదారుల వివరాలు..

ధ్వంసమైన తీరు	పొడవు	అంచనా విలువ (రూ. లక్షల్లో)
ఉపరితలంలో ధ్వంసమైన రోడ్లు	144.19కి.మీ	3,603
తెగిపోయిన రోడ్లు	1140(ఆర్ఎంఎస్)	418
కోతకు గురైనవి	2,525(ఆర్ఎంఎస్)	213
కల్వర్టులు ఇతరములు	43(సంఖ్య)	1713

మరమ్మతులు చేపట్టాలి



ధర్మపురి నుంచి జన్నారం వైపు వెళ్లే రాష్ట్ర రహదారి కొరండ్లపల్లె వద్ద తీవ్రంగా కోతకు గురైంది. పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. మరిన్ని ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి.

– సాయిని సత్యం, నక్కలపేట

కాంగ్రెస్ జెండా గద్దె కూల్చివేత



పదో వార్డులో కాంగ్రెస్ జెండా గద్దెను నిర్మిస్తున్న నాయకులు

జగిత్యాల క్రైం : పట్టణంలోని పదో వార్డు ఎలుకబావి వాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్మించిన జెండా గద్దెను గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారులతో మాట్లాడి మళ్లీ జెండా గద్దె నిర్మించారు. దీంతో మున్సిపల్ అధికారులకు, అక్కడే ఉన్న బీఆర్ఎస్, బీజేపీ జెండా గద్దెలు కూల్చివేస్తేనే తమ జెండా గద్దె కూల్చివేయాలని, అకారణంగా జెండా గద్దె కూల్చివేస్తే తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తుర్క రాజిరెడ్డి, నరేశ్, రజినీకాంత్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ ప్రాంతానికి చెందిన సాయి సంతోష్ ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బీట్‌బజార్‌కు చెందిన సాయిసంతోష్ ఈనెల 21న తన ద్విచక్రవాహనాన్ని కొత్తబస్టాండ్‌లో పార్క్ చేసి కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. పొలాసకు చెందిన భారతపు నాగరాజు ఈనెల 26న జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద తన ద్విచక్రవాహనాన్ని ఉంచి తిరిగి సాయంత్రం వెళ్లేసరికి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్లు



బాధితుడికి మనీ బ్యాగ్‌ను అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

- బస్సులో మర్చిపోయిన మనీబ్యాగ్ అప్పగింత

కోరుట్ల : స్థానిక బస్‌డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న తిరుపతి, లక్ష్మణ్ తమ నిజాయితీ చాటుకున్నారు. బస్సులో ఓ వ్యక్తి మరిచిపోయిన మనీ పర్సును ఫోన్‌నెంబర్ ద్వారా సమాచారం అందించి సదరు వ్యక్తికి అందజేశారు. వివరాల్లోకి వెళితే...కోరుట్ల డిపోకు చెందిన బస్సు వింజామూరు నుంచి కోరుట్లకు తిరిగి వస్తుండగా అక్కడ బస్సెక్కిన ఓ వ్యక్తి జగిత్యాలలో దిగి వెళ్లిపోయాడు. బస్సు కోరుట్ల డిపోకు రాగానే ప్రయాణికులు దిగి వెళ్లిపోగా బస్సులో ఓ పర్సు డ్రైవర్లకు కనిపించింది. దీంతో ఆ పర్సును ట్రాఫిక్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. అందులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా దస్తురాబాద్ మండలం, పెర్కపెల్లి గ్రామానికి చెందిన స్వీపతి సత్తన్నదిగా గుర్తించారు. మనీ పర్సులో పాస్‌పోర్టు, రెండు సెల్‌ఫోన్లు, 10 తులాల బంగారం ఉంది. దీంతో స్వీపతిని కోరుట్ల బస్ డిపోకు పిలిపించి మనీ పర్సును అతనికి అప్పగించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు తిరుపతి, లక్ష్మణ్‌ను డిపో మేనేజర్ లక్ష్మీ ప్రసూన అభినందించారు. అనంతరం బాధితుడు డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటేశం, సీఆర్‌సీ రామ్మోహన్, కార్గో ఎగ్జిక్యూటివ్ రమేశ్, సెక్యూరిటీ సిబ్బంది శ్రావణి పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన



నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మేడిపల్లి సత్యం

కొడిమ్యాల : అకాలవర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నల్లగొండలో పర్యటించి నష్టపోయిన పంటపొలాలను పరిశీలించారు, చొప్పదండి నియోజకవర్గంలోని 6 మండలాలలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రతి ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరీ నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మెన్ రమేశ్, డైరెక్టర్లు నాగభూషణ్‌రెడ్డి, కాదారి మల్లేశం, నాయకులు జితేందర్‌రెడ్డి, కట్ల చిరంజీవి, నర్సయ్య, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, అర్షనపల్లి సాయి పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాడేందుకే రాజకీయాల్లోకి'

బుగ్గారం (ధర్మపురి) : తాను పదవుల కోసం ఎదురుచూడలేదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్ అన్నారు. ధర్మపురి ఏఎంసీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల కేసు వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, నాయకులు రాజేశ్ కుమార్, సునీల్‌కుమార్, అయ్యోరి వేణుగోపాల్, బాలరాజు, నరేశ్, వసంత్, ఇక్రం, యూనుస్, రాజన్న, అలీం, నర్సయ్య, సురేందర్, రిషిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని పెద్దాపూర్‌లో పలువురు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రాజన్నల ఎల్లయ్య, కచ్చు మల్లయ్య వ్యవసాయ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా మోటార్లను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఉపేందర్‌ను మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. జైపూర్ స్టేషన్‌లో పనిచేస్తున్న రామక్రిష్ణను మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ విభాగానికి, కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రాజ్‌వర్ధన్‌ను మంచిర్యాల జిల్లా భీమారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కమలాకర్‌ను సీఎస్‌బీ రామగుండం, భీమారం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సుధాకర్‌ను సీసీఎస్ మంచిర్యాలకు బదిలీ చేశారు.

జీపీఎఫ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి



జెడ్పీసీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న అమర్

జగిత్యాల: పట్టణంలోని జెడ్పీ కార్యాలయంలో జీపీఎఫ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జెడ్పీ సీఈవో రామానుజచారికి పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, ఆనందరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విడిపోయిన జగిత్యాల జిల్లా పరిషత్ కార్యాలయంలో జీపీఎఫ్ విభాగం లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకు సంబంధించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్ లెడ్జర్స్ తెప్పించి జీపీఎఫ్ పార్ట్‌ఫైనల్ లోన్లు, ఫైనల్ పేమెంట్లకు సంబంధించిన అన్ని అప్లికేషన్లు జగిత్యాలలోనే తీసుకోవాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామానుజాచార్యులు

సారంగాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని జిల్లా సహకార అధికారి సముద్రాల రామానుజాచార్యులు అన్నారు. గురువారం మండలంలోని పోతారంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్‌విండో సిబ్బంది కేంద్రంలోకి వచ్చిన ధాన్యంలో తాలు లేకుండా చూసేలా రైతులకు సూచనలు చేయాలన్నారు. ప్రతిరోజు తేమశాతం గుర్తించి తూకం వేసి, మిల్లులకు తరలించాలన్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన వెంట విండో సీఈవో ఎండీ ఇస్మాయిల్, సిబ్బంది భూమేశ్, శివ, వరుణ్ తదితరులున్నారు.

'రైతులకు తక్షణమే పంటనష్ట పరిహారం అందించాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల రూరల్: రాష్ట్రంలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో పంటనష్టపోయిన రైతులకు పరిహారం తక్షణమే అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల బీజేపీ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి ఆధ్వర్యంలో రూరల్, అర్బన్ తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మామిడిరైతులకు ఎకరాకు రూ.80 వేల పరిహారం చెల్లించాలని, వరి, మొక్కజొన్న, నువ్వు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు పరిహారం అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుంకె దశరథ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ కొక్కుల గణేశ్, నాయకులు మేరుగు ఉమేశ్, భరత్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, మహేశ్, రామేశ్వరి, మహిపాల్, విష్ణువర్ధన్, ప్రమోద్ పాల్గొన్నారు.

ట్రినిటిలో గ్రాడ్యుయేషన్ 'డే'





పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ప్రైమరీ పాఠశాలలో గురువారం కిండర్‌గార్డెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాధులనూ ఆక్రమిస్తారా..?

- ఏళ్ల తరబడి అక్కడే ఖననం చేస్తున్నం
- ఇప్పుడు కూలగొట్టి చదును చేయడమేంటి..?
- చర్యలు తీసుకోవాలని దళిత కుటుంబాల వినతి



నిరసన తెలుపుతున్న దళిత కుటుంబాలు

సుల్తానాబాద్: తమ బంధువుల్లో ఎవరు చనిపోయినా ఏళ్ల తరబడి ఇక్కడే సమాధి చేస్తున్నామని, ఇప్పుడు ఆ స్థలంలోని సమాధులు తొలగించి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారని సుగ్లాంపల్లికి చెందిన కొన్ని దళిత కుటుంబాలు నిరసనకు దిగాయి. వారి కథనం ప్రకారం.. సర్వే నంబర్ 487లో కొంత స్థలంలో సుగ్లాంపల్లికి చెందిన దళితులు ఎవరు చనిపోయినా అక్కడే ఖననం చేస్తున్నారు. 90 ఏళ్లుగా ఆ స్థలంలోనే సమాధులు కడుతున్నారు. తాజాగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు హుస్సేనిమియావాగుకు వెళ్లే ఒర్రె కాలువను పూడ్చివేశారు. జేసీబీ సహాయంతో సదరు స్థలాన్ని రాత్రికిరాత్రే చదును చేశారు. విషయం తెలుసుకున్న దళితులు కొందరు స్థలం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. పట్టాభూమి అయితే ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కావాలనే సమాధుల స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. విషయాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, కలెక్టర్ సంగీత దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నిరసనలో బొడ్డు శంకర్, నర్సింగ్, చందర్, పర్వతాలు, బాపురావు, మల్లమ్మ, స్వప్న, లావణ్య, రాజేశ్వరి, పొన్నాల రవీందర్, తాండ్ర చందర్, కొత్తూరు నారాయణ, కొత్తూరు మణెమ్మ, కేతమ్మ, సునీత ఉన్నారు. వీరికి బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెపల్లి రాకేశ్, అంబేద్కర్ యువజన సంఘం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి రాహుల్ సంఘీభావం తెలిపారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

జగిత్యాల: నిబంధనలు అతిక్రమించి ఉత్తర్వులు జారీచేస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డిని విధుల నుంచి తప్పించి సమగ్ర విచారణ చేపట్టాలని గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లతకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 20 ఏళ్ల అనధికార సెలవుపై విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చిన ఉపాధ్యాయుడికి పోస్టింగ్ ఇవ్వడం, రెండు సంవత్సరాల క్రితం జగిత్యాల పట్టణ గర్ల్స్ హైస్కూల్‌లో పనిచేస్తున్న కాలంలో డీఎస్సీ 1996కు చెందిన ఓ ఉపాధ్యాయురాలు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా బీఈడీ సర్టిఫికెట్ ఫేక్ అని తెలిసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో సైతం అక్రమాలు జరిగాయన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏజెంట్లు ఆర్థికంగా నిలదిక్కుకోవాలి



సలహాదారు విఠల్‌ను సత్కరిస్తున్న ఏజెంట్లు

జగిత్యాల: జీవితబీమా రంగం అద్భుతమైందని భారతదేశ నంబర్‌వన్ జీవితబీమా సలహాదారు కటికె విఠల్ అన్నారు. గురువారం స్థానిక వాసవీ గార్డెన్‌లో ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెంట్లు ప్రజలకు సేవచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఏజెంట్లకు సంబంధించిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వాసవీ ట్రస్ట్ చైర్మన్ పబ్బ శ్రీను, ప్రసాద్, శ్రీధర్, గంగాధర్, వెంకటస్వామి, చంద్రశేఖర్, రాజగంగారాం, అయిలయ్య, నాగభూషణం, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.